# విలువలు

ఎమ్. లక్ష్మీ రమణి కుమారి

"మీ ఫ్రెండ్ నవల సినిమా తీస్తున్నారట కదా?" కాఫీ కప్పు అందిస్తూ ప్రభాత్‌ని అడిగింది కాంతిమతి.

"తెలియదు. నువ్వెక్కడ సంపాదించావు ఈ సమాచారం" భార్యను అడిగాడు ప్రభాత్.

"ఎక్కడన్నా తిరిగి సంపాదించాలా ఏమిటి ఆయన గురించి సమాచారం. ఆయన మామూలు మనిషా. ప్రఖ్యాత రచయిత. ప్రతి పత్రికలో ఆయన గురించి రాస్తూనే ఉంటారు"అన్నది కాంతిమతి.

"ఆ నవల తెచ్చాను. చదువుతారా?" అడిగింది.

"చదువుతాను."

కాంతిమతి లేచి కొత్తగా ఆ రోజే కొన్న ఆ నవల తీసుకొని వచ్చింది.

ఆఫీసు నుండి వచ్చి రిఫ్రెష్ అయి విశ్రాంతిగా ఉన్నాడు ప్రభాత్. కాబట్టే అంత పెద్ద నవలచూసి భయపడకుండా ఆరోజే పూర్తి చేసెయ్యగలననే ధైర్యంతో తెరచి చదవటం మొదలుపెట్టాడు.

చదువుతున్న కొద్దీ అతనికి మతి పోయింది.

అతనీమధ్య నవలలు, పత్రికలు చదవటం లేదు. సాహిత్యం ఏ స్థాయికి చేరుకున్నదీ అతనికి తెలీదు. కొన్ని పత్రికలు ఏవిధమైన కథలు ఎక్కువగా ప్రచురిస్తున్నదీ తెలీదు.

నవల నిండా సెక్సు. అవసరం లేని చోటా, అనవసరమైన చోటా, ఏదో ఒక సన్నివేశం కల్పించి అంగాంగ వర్ణన. చదువుతున్న కొద్దీ జుగుప్స, రోత కలిగాయి.

తనలాగా పెళ్లయి, పిల్లలున్న వాళ్లు



లేదు. కానీ కొత్తగా యవ్వనంలోకి అడుగు పెట్టి ఏది మంచో ఏది చెడో తెలుసుకోలేని స్థితిలో యిలా మనసుని రెచ్చగొట్టేట్లున్న కథలు చదివితే ఆ పిల్లలు ఏమౌతారు?

అతనికి చాలా చిరాకు కలిగింది.

రాజా చిన్ననాటి స్నేహితుడు. ఇప్పుడు పెద్ద రచయిత అయి డబ్బూ, పేరూ సంపాదించినా అతనితో తన స్నేహం తగ్గ లేదు.

ఇప్పటికీ ఏదన్నా ఫంక్షన్ ఉంటే తనను పిలుస్తాడు. తనింట్లో ఏ విశేషం జరిగినా రాజా కుటుంబాన్ని ఆహ్వానిస్తారు. యిద్దరికీ ఎవరి ఉద్యోగాలు, వ్యాపకాలు వారికి ఉండటం వల్ల తరచు కలుసుకోలేక పోతున్నా స్నేహానికి మాత్రం ఆటంకం లేదు.

రేపు ఎలాగైనా రాజాని కలసి చర్చించి అతన్ని యిలాటి రాతలు రాయకుండా విర మింపజేయాలనుకొన్నాడు ప్రభాత్.

మర్నాడే రాజా యింటికి వెళ్లాడు.

అంతకుముందు తను వచ్చినా శ్రద్ధగా గమనించలేదు. కానీ ఆ యిల్లు ఐశ్వ ర్యంతో మునిగి తేలుతున్నట్లు గమనిం చాడు ప్రభాత్. అధునాతనమైన బంగళా, చుట్టూ గార్డెన్, పోర్టికోలో కారు, కుక్క, నౌకర్లు, యింట్లో ఖరీదైన సామానులు అడుగడుగునా యింటి యజమాని ఐశ్వ ర్యాన్ని చాటి చెప్తున్నాయి.

రాజా తయారై ఎక్కడికో వెళ్తున్న ట్లున్నాడు.

ప్రభాత్‌ని చూసి సాదరంగా ఆహ్వా

# విలువలు

నించాడు.

"ఎక్కడికో ప్రయాణమైనట్లున్నావ్?"

"అవును. స్టోరీ డిస్కషన్ ఉందిలే. ఫరవాలేదు. యింకా టైముందిలే. సీతమ్మా రెండు కప్పులు టీ తీసుకురా" అంటూ వంట మనిషికి పురమాయిం చాడు.

"ఏంటి, యిలా హఠాత్తుగా వచ్చావు. ఏంటి విశేషం. కూర్చో" అన్నాడు.

యిద్దరూ కూర్చున్నారు.

ప్రభాత్‌కి ఏం చెయ్యాలో తోచలేదు.

తానేదో అతనితో చర్చించాలనీ, బోధించాలనీ వచ్చాడు. కానీ యితను బిజీగా ఉన్నాడు. తన మాటలు వింటాడా అసలు.

"ఏం లేదు. మొన్న నీ నవల చది వాను. అదే మృత్యుక్షణం. దాని గురించి మాట్లాడదామనీ" అన్నాడు ప్రభాత్.

"ఓ. చదివావా. చాలా థాంక్స్. దానిమీద ఏమిటి నీ అభిప్రాయం?" అడి గాడు రాజా.

"నీ నవల నాకేం నచ్చలేదు రాజా" అనేశాడు ప్రభాత్.

"ఎందుకని?" తాపీగా అడిగాడు రాజా.

"సెక్స్, హింస తప్ప నాకేం కనబ డలేదు అందులో" అన్నాడు.

"ఇప్పటి ట్రెండ్ యింతే" అన్నాడు రాజా.

"అంటే ట్రెండ్ బట్టి రాస్తావు అంతే ...ని హృదయం స్పందించ లేదా!" ఆవేశంగా అన్నాడు ప్రభాత్.

"నేను ప్రొఫెషనల్ రైటర్‌ని. ఎప్పుడూ ఏదో ఒకటి రాసి వెలుగులో ఉండటమే నాక్కావాలి. నూటికి తొంభైశాతం మంది యిలాటి రచనలే కోరుకుంటున్నారు. నేను వాళ్లకు కావల్సింది అందిస్తాను" అన్నాడు రాజా.

ప్రభాత్ ఏమీ మాట్లాడలేకపోయాడు.

"నీలాగ ఆలోచించే వాళ్లు ఎందరుం టారు. సాహితీ విలువలు గల రచ నలు మాత్రమే అచ్చు వేయాలని మొదలు పెట్టిన పత్రికలు ఎంతవరకు నడు స్తున్నాయి? యిదివరకు ప్రేమ కథలు వచ్చాయి. యిప్పుడు హింస, ప్రతీకారం, శృంగారం ఉంటే బాగా నడుస్తున్నాయి. ఇక కొన్నాళ్లకు యింకేమి కావలసి వస్తే అది ప్రధానంగా నవలలు వస్తాయి. నేను ఒక్కడిని మడిబట్ట కట్టుకొని కూర్చున్నంత మాత్రాన సాహిత్యం విలువ పెరిగిపోదు. పైగా నా కన్నా ఎక్కువ శృంగారం రాసే వాడు వచ్చి పేరూ డబ్బూ సంపాదించే స్తాడు. వాళ్లకా ఛాన్స్ నేనెందుకివ్వాలి? రచయితగా నా స్థానాన్ని నేను నిలబెట్టు కోవటానికి అహర్నిశమూ కృషి చేస్తాను" అన్నాడు రాజా.

ప్రభాత్ మౌనం వహించాడు.

అతని మనసులో ఎన్నో ప్రశ్నలు మెదులుతున్నాయి.

కానీ వాటిని రాజాముందు బయట పెట్టలేకపోయాడు.

సాహిత్యానికి- ప్రయోజనం లేదా?

ఏదో ఒకటి రాసి ప్రజలముందు విర జిమ్మి డబ్బు చేసుకోవటమేనా?

అర్థం తప్ప పరమార్థం లేదా?

శక్తివంతమైన ప్రచార సాధనం పత్రికా రంగం. కథలవల్ల ప్రజలను మూఢ నమ్మకాల నుంచీ, మూర్ఖత్వం నుంచి తప్పించి జాగృతి కలిగించారు వీరేశలింగం, గురజాడ వంటివారు.

పాఠకులకు బోర్ కొట్టకుండా ఉండ టానికి వీలైనంత వినోదం జొప్పించినా, సందేశాత్మకంగా ఉంటే వారికి చదివినం దుకు మేలు చేకూరుతుంది కదా?

సామాజిక బాధ్యత, సామాజిక స్పృహ మనిషన్నవాడికి అవసరం. మరి రచయితకు ఆ బాధ్యత లేదా?

యివన్నీ రాజాను అడగదల్చుకోలేదు ప్రభాత్.

రాజాకు యిద్దరు కూతుళ్లు.

## మీ జి. కె. ఎంత?

(1) ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రులయిన మొట్ట మొదటి తండ్రీ కొడుకులు ఎవరు?

(2) ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నుండి డాక్టరేట్ పొందిన ప్రథమ మరియు ఆఖరి భారతీయు లెవరు?

(3) 'గాన్ విత్ ది విండ్' పుస్తక రచయిత ఎవరు?

(4) ప్రపంచంలో కెల్లా అత్యుత్తమ భూగర్భ రైల్వే పేరు పొందిన మెట్రో రైల్వే ఏ దేశంలో వుంది?

(5) ప్రస్తుతం 'అలీన దేశాల' ఛైర్మన్ ఎవరు?

(6) 'రిచర్డ్ అటిన్‌బరో' నిర్మించిన 'గాంధీ' ఆంగ్ల చిత్రానికి సంగీత దర్శకత్వం, ఛాయాగ్రహ దర్శకత్వం వహించిన భారతీయు లెవరు?

(7) ఆశియాలోని మొట్ట మొదటి భూగర్భ 'హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ యూనిట్' ఎక్కడ వుంది?

(8) 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అని సరోజినీ నాయుడుని అంటారు. అయితే సరోజినీ నాయుడుగారు ఎవరిని 'నైటింగేల్ ఆఫ్ ఇండియా' అని పిలిచే వారు?

(9) 'గ్రూప్ ఆఫ్ సెవెన్' (జి-7) అని పిలువబడే ఏడు ధనిక దేశాల పేర్లేమిటి?

(10) జె. కె. ఎల్. ఎఫ్. విస్తరణ ఏమిటి?

-జైకిరణ్

(జవాబులు ఈ సంచికలోనే)

పెద్ద కూతురికి పదిహేనేళ్లు.

"మీ అమ్మాయి నీ నవలలు చదువుతుందా?" అడిగాను.

"నీ అభిప్రాయం అర్థమైంది. అంటే నా కథలు చదివితే పిల్లలు చెడిపోతారు కాబట్టి నా కథలు నా పిల్లలను చదవనివ్వనేమో అనుకొంటున్నావు కదూ. అదేమీ లేదు. నా కథలు ఏవైనా సరే నా పిల్లలు చదువుతుంటే నేనేమీ అనను. అయినా పిల్లలు అన్నీ తెలుసుకొని తమంత తామే అర్థంచేసుకోవాలోయ్. వాళ్లను ఎంతకని కట్టిపారేయగలం. బైట రకరకాల సాధనాలు ఉన్నాయి. సినిమాలు, వీడియోలు ఉన్నాయి. చెడిపోయే వాళ్లకు ప్రత్యేకించి నా నవలలే అక్కర్లేదు" అన్నాడు రాజా.

"ఏమిటో ఈమధ్య ఏమీ చదవటం లేదు తీరికలేక, యిప్పుడు సడన్‌గా నీ నవల కదా అని కుతూహలంతో చదివాను. ఎంతో ఆశించి చదివిన నాకు అలాటి కథ చదవగానే ఎందుకో చాలా నిస్పృహ కలిగింది. దాంతో ఆపుకోలేక వచ్చాను. నువ్వు స్నేహితుడివి కదా విమర్శ స్వీకరిస్తావనుకున్నాను" అన్నాను.

"నువ్వు సహృదయంతో వచ్చావని తెలుసు నాకు. నీ విమర్శ అర్థం చేసుకున్నాను. కానీ నా పాయింట్స్ కూడా నువ్వు అర్థం చేసుకోవాలి" అన్నాడు రాజా.

అతన్ని తను మారుద్దామనుకొన్నాడు.

కానీ అతనే తనని మార్చేద్దామని చూస్తున్నాడు.

"కాలం మారిపోయింది" అన్నాడు ప్రభాత్.

"కాలం మారలేదు. పూర్వకాలంలో బూతు పురాణాలు, బొమ్మలు లేవా? ఏదో గ్రాంధికంలో ఉంటే ఎవరికీ అర్థంకాక ఊరుకొనేవారు. జయదేవుడి అష్టపదులు చూడు. అర్థం తెలిస్తే అది భక్తిగా వినగలవా నువ్వు. పూర్వకాలంలో రాజుల్ని మెప్పించేందుకు వారి మీదా, వారి రాణుల మీదా, ఉంపుడుగత్తెలమీదా కవిత్వం విశృంఖలంగా రాయలేదా. పురుషులే కాదు. ఎంతోమంది కవయిత్రులు కూడా శృంగారానికి అధిక ప్రాధాన్యత యిచ్చి విజృంభించి రాసిన కవిత్వం ఎంతో ఉంది" అన్నాడు రాజా.

వంట మనిషి టీ తెచ్చి యిచ్చింది.

టీ ప్రభాత్‌కి యిచ్చి తాను లోపలకు వెళ్లి వచ్చాడు రాజా.

అతను రెండు పెగ్గులు వేసుకొచ్చాడని గ్రహించాడు ప్రభాత్.

ఉబ్బిన రాజా కళ్లు కళ్లల్లో జీరలు అతను తరచు తాగుతున్నాడన్న విషయాన్ని తెలియజేస్తున్నాయి.

సామాజిక స్పృహ సంగతి అవతల పెడితే అసలు స్పృహలో ఉండి రాస్తున్నాడా అతను అని ఆశ్చర్యం కలిగింది ప్రభాత్‌కి.

"వచ్చే నెల మా కుటుంబం అంతా అమెరికా వెళ్తున్నాం" ఆనందంగా చెప్పాడు రాజా.

"అలాగా చాలా సంతోషం" అన్నాడు ప్రభాత్.

అతను టీ తాగడం ముగించి లేచాడు.

"రాక రాక వచ్చావు, కాసేపు తీరికగా మాట్లాడటానికి కూడా లేకపోయింది" నిజంగానే నొచ్చుకుంటూ అన్నాడు రాజా.

"ఫరవాలేదు. ఏదో ఆ నవల గురించి మాట్లాడదామని వచ్చాను. అది అయిపోయింది" అన్నాడు ప్రభాత్.

"నేను చెప్పిందానికి కన్విన్స్ అయ్యావా?" అడిగాడు రాజా.

ప్రభాత్ ఏమీ మాట్లాడకుండా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

అతని మనసు ఏమాత్రం రాజీ పడలేదు రాజా మాటలకు. అయినా రాజా వ్యవహారం చూస్తే తన మాటలు ఏమీ వినిపించుకొనేటట్లు లేదు.

డబ్బు సంపాదన అనే నిషా అతన్ని ఆవరించింది. అతను అందులోంచి బయటకు రాడు.

"పద, నిన్ను యింటి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు రాజా.

"ఫరవాలేదు. బసలో ఎళ్తాను" ప్రభాత్ ముందుకి నడిచాడు.

"నీ యిష్టం" అన్నాడు రాజా.

ప్రభాత్ బయటకు వచ్చాడు. బస్ స్టాండ్ వేపు నడుస్తున్నాడు.

అతని ముందునుంచి రాజా కారు దూసుకుపోయింది.

ప్రభాత్ ఆలోచిస్తున్నాడు.

రాజా లాంటి రచయితలు మంచి రచనలు చేయగలిగి ఉండి కూడా చేయక పోవటానికి కారణం ఏమిటి?

"డబ్బు", "పేరు"

కీర్తి.....కనకం.

ఈ రెండింటికోసం వారు కళాన్ని అమ్ముకొంటున్నారు. అందుకనేనా పెద్దలు ఋషి కానివాడు కావ్యం రచించలేడన్నారు.

సంసారం, తాపత్రయం ఉన్న వారికి ఎలాగ జీవితంలో పైకి వద్దాం అనే ఉంటుంది కానీ ఉత్తమ రచనలు చేయాలని ఉండదా?

కానీ మరి కొందరు ఎంత దుస్థితిలో ఉన్నా మంచి రచన అయితే తప్ప చెయ్యకుండా ఉన్నవాళ్లు లేరా?

పెరుగుట విరుగుట కొరకే అన్నారు.

పెచ్చుమీరిన ఈ శృంగారం, హింస మొదలైన రసాలు పోయి సాహిత్యం కొత్త చిగుళ్లు వేసే రోజు తప్పక వస్తుంది.

ఆరోజు దగ్గర్లోనే ఉంది.

అదే ఆశతో అడుగులు ముందుకు వేశాడు ప్రభాత్.

## పట్టు వదలని విక్రమార్కుడు వినోద్ ఖన్నా



'మహా సంగ్రామ్' చిత్రంమీద వినోద్ ఖన్నా ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు. కానీ అవన్నీ అడియాశలు అయిపోయాయి. దీంతో అతని 'ప్రైస్' డౌనయిపోయింది. పాత రేటివ్వమంటున్నారు నిర్మాతలు. అమితాబ్, మిథున్‌లా తాను రేటు తగ్గించుకోనంటున్నాడీ పెద్ద మనిషి! ఇప్పుడెలా? ఫిల్మ్ లైన్ వదిలేసేందుకు రెడీ అవుతున్నాడా ఈ యాంగ్రీ యంగ్ హీరో? అదే జరిగితే, ఇప్పుడే రజనీష్ ఆశ్రమంలో మనశ్శాంతి పొందగలడు.

-సుంకర